www.prajasakti.com
# ప్రజాశక్తి
మంగళవారం 30 మే 2023
5
తిరుపతి

షార్‌లో విద్యార్థుల సందడి

విద్యుత్ బిల్లులు చెల్లించలేక బీడువారిన భూములు

### జీవో 16పై అవగాహన ఏది..?
### విద్యుత్ సబ్సిడీ కోల్పోతున్న రైతులు
### 'బీడు'ను తలపిస్తున్న అధికారుల నిర్లక్ష్యం

# 'ఆక్వా జోన్' గందరగోళం..!

**ప్రజాశక్తి - వాకాడు**

**చౌడు, వ్యవసాయేతర, పోరంబోకు భూములు ఇతరత్రా పనికిరాని భూములను రొయ్యల పెంపకానికి వాడుకోవాలి. అటువంటి భూముల మీద మత్స్యశాఖ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంది. 60శాతం కంటే ఎక్కువ కలిగి ఉన్నట్లయితే అది ఆక్వాజోన్ కిందకు వస్తుంది.. ఆక్వాజోన్ పరిధిలోని రైతులు 1.50 యూనిట్ ధర చెల్లించాల్సి వస్తే, పరిధిలో లేనివారు యూనిట్ ధర 3.50పైనే చెల్లించాలి.... జీవో నంబర్ 16,2018 ప్రకారం**

సముద్ర తీర ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న గ్రామ ప్రజలు ఎక్కువశాతం మత్స్యసంపదను నమ్ముకుని జీవనం సాగిస్తూ ఉంటారు. తీరప్రాంత భూమి కొంత వ్యవసాయానికి ఉపయోగపడితే, మరికొంత భూమి రొయ్యల ఉత్పత్తికి అనుకూలంగా ఉంటుంది. దీనిద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని గడించడం వల్ల దేశానికి ఆర్థికంగా ఆదాయం సమకూరుతుంది. 2022, మే నుంచి విద్యుత్ ఛార్జీలు ఒక్కసారిగా పెంచడంతో ఆక్వా సాగు చేస్తున్న రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి డీలా పడ్డారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో మొత్తం 3,750 ఆక్వా కనెక్షన్లు ఉంటే అందులో 2,197 (58శాతం) కనెక్షన్లు బిల్‌స్టాప్ కింద నిలిపేశారు. 1544 మాత్రమే లైవ్‌లో ఉన్నాయి. 3,780 కనెక్షన్లలో 995 (26శాతం) ఆక్వా జోన్ కింద ఉన్నాయి. మిగిలిన 2,785 (73శాతం) నాన్ ఆక్వా జోన్ పరిధిలో ఉన్నాయి. కోటలో 388 ఆక్వాజోన్ పరిధిలో ఉండగా, 72 నాన్ ఆక్వాజోన్‌లో ఉన్నాయి. వాకాడులో 471 ఆక్వాజోన్ పరిధిలోనూ, 764 నాన్ ఆక్వాజోన్ పరిధిలో ఉన్నాయి. చిట్టమూరులో 138 ఆక్వాజోన్, 1258 నాన్ ఆక్వాజోన్ కింద ఉన్నాయి. మొత్తం కోస్టల్ ఆక్వా కల్చర్ అస్తవ్యస్థమై రొయ్యలగుంటలు బీడుపోయాయి, దానిపై ఆధారపడి ఉన్న అనేక వ్యాపారాలు చిన్నాభిన్నమయ్యాయి. ప్రస్తుతం పెరుగుతున్న మేతల రేట్లు, రసాయనాల రేట్లుతో పాటు మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ప్రస్తుతం రొయ్యల పెంపకందారుల పరిస్థితి పెట్టిన పెట్టుబడులు వెనక్కి రాక నష్టాల ఊబిలో కూరుకుపోయి ఉన్నారు. ఆక్వా రైతులందరికీ విద్యుత్ ఛార్జీల విషయంలో సమన్యాయం చేయాలని కోరుతున్నారు.

| ప్రాంతం | ఆక్వాజోన్ | నాన్ ఆక్వాజోన్ |
|---|---|---|
| కోట | 388 | 72 |
| వాకాడు | 471 | 764 |
| చిట్టమూరు | 138 | 1258 |

**ఆక్వాజోన్‌గా గుర్తించాలి : కె.వెంకటరమణయ్య, చిట్టమూరు**

మా ఆక్వా యూనిట్ నాన్ ఆక్వా జోన్ పరిధిలో ఉందని చెబుతున్నారు. యూనిట్‌కు రూ.5 చెల్లించలేక బిల్ స్టాప్‌లో ఉంది. సర్వీసును లైవ్‌లో తీసుకురావడానికి అంత డబ్బు చెల్లించే పరిస్థితి లేదు. దీంతో యూనిట్‌ను లైవ్‌లోకి తీసుకురాలేకపోతున్నాను. ప్రభుత్వం స్పందించి ఆక్వా జోన్‌గా మారుస్తుందేమోనని ఎదురుచూస్తున్నాను.

**క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం : చాంద్‌బాషా, ఫిషరీ ఏడీ**

జీవో నంబర్ 16/2018 ప్రకారం సర్వే చేసి ఏఏ గ్రామాలు ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ కిందకు వస్తాయో క్షేత్రస్థాయిలో పరిశీలించి పంపించాం. మార్పులు చేర్పులు ఏవైనా ఉంటే రెండు మూడు రోజుల్లో కమిటీ వేసి ఆ ప్రకారం నిర్ణయం తీసుకుంటాం.

# 'దారి' చూపే నావిగేషన్ ఉపగ్రహాలు

**జిఎస్ఎల్వి -ఎఫ్ 12 రాకెట్ ప్రయోగం సక్సెస్**

**ప్రజాశక్తి-సూళ్లూరుపేట**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. జిపిఎస్ తరహాలో రోడ్డు, గగన, జల మార్గాల్లో ఈ ఉపగ్రహాలు దారి చూపనున్నాయి. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుండి సోమవారం ఉదయం 10 గంటల 42 నిమిషాలకు జిఎస్ఎల్ వి -ఎఫ్12 రాకెట్ ను ప్రయోగించారు. ఈ ప్రయోగానికి ఆదివారం ఉదయం 7.12 గంటలకు కౌంట్ డౌన్ ప్రక్రియ ప్రారంభమైంది. 27.30 గంటలపాటు కౌంట్ డౌన్ ప్రక్రియ కొనసాగిన అనంతరం జి ఎస్ ఎల్ వి-ఎఫ్12 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ రాకెట్ ద్వారా ఎన్‌విఎస్ -01 అనే నేవిగేషన్ ఉపగ్రహాన్ని ప్రయోగించా రు. శ్రీహరికోటలోని రెండవ ప్రయోగ వేదిక నుండి ఈ ప్రయోగం జరిగింది. 2232 కిలోల బరువు ఉండే ఎన్ వి ఎస్ -01 అనే నేవిగేషన్ ఉపగ్రహాన్ని భూదవ కక్ష్యలో ప్రవేశ పెట్టారు.ఈ ఏడాది ఇప్పటికే నెలకు ఒక రాకెట్ చొప్పున ఫిబ్రవరి నుండి ఇప్పటిదాకా నాలుగు రాకెట్లను ప్రయోగించగా అవన్నీ విభిన్న తరహా రాకెట్లు కావడం విశేషం.

**నావిగేషన్ ఉపగ్రహం ఎంతో అవసరం**

మన దేశానికి స్వదేశీ నావిగేషన్ సేవలు అత్యంత అవసరంగా ఉన్నాయి. అంతరిక్షంలోకి నావిక్ ఉపగ్రహాల శ్రేణిని ఉపయోగించి వాటి ద్వారా మార్గాలలో వాహనాలు మార్గం చూసుకునే సౌకర్యం ఈ ఉపగ్రహాలకు ఉంది. మనం నిత్యం చెప్పుకునే జిపిఎస్, గూగుల్ వంటి సేవలే ఈ స్వదేశీ నావిగేషన్ సేవలు. మనదేశంతో పాటు చుట్టూ విస్తరించిన ఎటుచూసినా మరో 1500 కిలోమీటర్ల దూరం ఈ నావిక్ పసిగడుతుంది. అందుచేతనే శత్రువుల నుంచి రక్షణ కూడా నావిక్ ఉపగ్రహాలు ఉపయోగపడతాయని స్పష్టమవుతుంది. పైగా ఈసారి అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలను అమర్చినందున భూమి మీద వాతావరణం, సముద్రంలోని మత్స్య సంపద ఉనికి వంటివి కూడా పసి కట్టడానికి అవకాశం ఉంటుంది. 51.7 మీటర్లు ఎత్తు, 420 టన్నులు బరువు కలిగిన జిఎస్ఎల్వి - ఎఫ్12 రాకెట్ మొత్తం 3 స్టేజిలు ఉంటుంది. రాకెట్ ప్రయోగం జరిగిన అనంతరం 18 నిమిషాల నుండి 15 నిమిషాల మధ్య సమయంలో ఎన్ వి ఎస్ -01 ఉపగ్రహాన్ని నిర్దిష్ట కక్ష్యకు చేర్చడం జరిగింది. ఈ ఉపగ్రహం 12 సంవత్సరాల పాటు సేవలు అందించే విధంగా ఇస్రో శాస్త్రవేత్తలు రూపొందించారు. గతంలో ప్రయోగించి ఉన్న నేవిగేషన్ ఉపగ్రహాలకన్నా అత్యంత అధునాతన సాంకేతిక పరికరాలను ఈ ఉపగ్రహంలో పొందుపరిచారు. రాకెట్ ప్రయోగం విజయవంతం అయినందుకు శ్రీసిటీ వ్యవస్థాపక నిర్వాహక సంచాలకులు డా. రవీంద్ర సన్నారెడ్డి హర్షం వెలిబుచ్చారు.

రూ.10 వేలు లంచం తీసుకుంటూ...

## ఏసీబీకి చిక్కిన ఆర్ఐ, విఆర్ఎ

**ప్రజాశక్తి - తడ**

మండల తహశీల్దార్ కార్యాలయంపై సోమవారం ఏసీబీ దాడులు జరిగాయి. ఆర్ఐ అనిత, విఆర్ఎ శంకర్‌లు రూ.10వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డారు. ఏసీబీ డిఎస్పి శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్లు ఈశ్వర్, సునీల్, వెంకటరమణలు చెప్పిన వివరాల మేరకు... తడ మండల పరిధిలోని కట్టవ గ్రామంలో ఓ రైతు టేకు చెట్లను పెంచాడు. వాటిని నరికేందుకు అనుమతి కోసం ఆర్ఐని, విఆర్ఎని కలిసారు. అనుమతి ఇవ్వడానికి వారు 15వేల రూపాయలు డిమాండ్ చేశారు. పదివేలిచ్చేలా బేరం కుదిరింది. ఆ నగదును సోమవారం ఆర్ఐ అనిత తీసుకుని విఆర్ఎ శంకర్‌కు ఇస్తుండగా ముందస్తుగా సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

# ఉద్యమ నిర్మాత జక్కా వెంకయ్య

**ప్రజాశక్తి - గూడూరు టౌన్/సూళ్లూరుపేట**

ఉద్యమ నిర్మాత జక్కా వెంకయ్య ఐదో వర్థంతి పురస్కరించుకుని సిపిఎం శ్రేణులు గూడూరు, సూళ్లూరుపేటల్లో ఘనంగా నివాళి అర్పించారు. గూడూరులో నాయకులు జోగి శివకుమార్ అధ్యక్షత వహించారు. నెల్లూరు జిల్లా దామరమడుగులో 1930, నవంబర్ 3న జన్మించారని, 2018, మే 29న అనారోగ్యంతో మృతిచెందారని తెలిపారు. 1953లో దామరమడుగులో గొప్ప పోరాటాన్ని నడిపారన్నారు. నెల్లూరు జిల్లాలో భూ, కూలి, రైతాంగ పోరాటాలకు ఆయన నాయకత్వం వహించారన్నారు. 1992లో ఆక్వా రైతుల సమస్యలపై పోరాడారన్నారు. ఉద్యమాలకు ముందు నిలబడి నడిపించిన మహా వ్యక్తి అని గుర్తు చేసుకున్నారు. జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా, కేంద్ర కమిటీ సభ్యులుగా అల్లూరు శాసనసభ సభ్యులుగా బాధ్యతలు వహించారన్నారు. ప్రజల కోసం జీవితాంతం కృషి చేసిన త్యాగమూర్తని అన్నారు. అతను రచించిన 'రాజకీయ అర్థశాస్త్రం అదనపు విలువ - శ్రమ దోపిడీ' అనే పుస్తకాలు విస్తత పాఠకాదరణ పొందాయన్నారు. ఈకార్యక్రమంలో టి.వెంకటరామిరెడ్డి, బి.వెంకటరమణయ్య, జి.మధు, పుట్టా శంకరయ్య, కాళహస్తి రఫీ, బి.గోపీనాథ్, కె.సుబ్బయ్య, మణి, అడపాల ప్రసాద్, ప్రభావతి పాల్గొన్నారు. సూళ్లూరుపేటలో బి.పద్మనాభయ్య, ఎస్.అల్లెయ్య, సిహెచ్ సుధాకర్‌రావు, వేణు, చంద్రశేఖర్, జిజె రాజశేఖర్, నాగరాజు, పి.మనోహర్, డి.రమణయ్య, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు లక్ష్మి పాల్గొన్నారు. అనంతరం సాయిసేవా వృద్ధాశ్రమంలో వృద్ధులకు బియ్యం, చిల్లర సామాన్లు అందజేశారు.

గూడూరులో...

సూళ్లూరుపేటలో...

# మోడీ తీరు నిరసిస్తూ ధర్నా

**తిరుపతి సిటి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అంటరానితనాన్ని ప్రోత్సహిస్తోందని మోడీ తీరును నిరసిస్తూ సమతా సైనిక్ రాష్ట్ర పిఎస్ చిరంజీవి విమర్శించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించిన దేశ ప్రధాని నరేంద్రమోడీ శంకుస్థాపనకు దళితుడైన రామ్‌నాథ్ కోవింద్‌ను పిలవకుండా తప్పు చేశారని, ఇపుడు పార్లమెంట్ ప్రారంభోత్సవానికి గిరిజనురాలైన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పిలవకపోవడంపై మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్ నడుపుతున్న ఈ ప్రభుత్వంలో కులం, మతం అంటరానితనం పేట్రేగిపోతోందన్నారు. ఇప్పటికైనా బహుజనులు మేల్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆమూరి సుధాకర్, రాధాక్రిష్ణ, పున్నకా సురేష్, చెన్నకేశవులు, కల్యాణ్, గండికోట సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఫోరం ఫర్ సోషల్ జస్టిస్, ప్రజాసంఘాల ఐక్యవేదిక, ఎపిఎస్‌డబ్ల్యుఎ, ఎస్ఎస్‌డి సంయుక్త ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు, నల్లజెండాలతో ధర్నా జరిగింది. నాయకులు ఎం.ప్రసాదరావు మాట్లాడుతూ ఏ అర్హత లేని సన్యాసుల చేత ప్రజాస్వామ్యానికి దేవాలయమైన పార్లమెంట్‌ను ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. భవనాన్ని శుద్ధి చేయించి రాష్ట్రపతి చేతుల మీదుగా పున్నప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తున్న బిజెపి ప్రభుత్వానికి దగ్గరలోనే ప్రజా కోర్టులో ఉరి తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర, ధనశేఖర్, గోపి, త్యాగరాజు, రమేస్, నాగేశ్వరరావు, ఇందిరా, మహేష్, గిరిజ, రాజేష్, కాళయ్య, ప్రభాకర్, గిరి, బిట్టు తదతరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల డిమాండ్లు పరిష్కరించాలి

**ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి**

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్, శ్రీకాళహస్తి**

జర్నలిస్టులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్రస్థాయి పిలుపు మేరకు తిరుపతి కలెక్టరేట్‌లో కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీధర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ, చిన్నపత్రికలకూ అక్రిడేషన్ కార్డులు, బస్సు పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లస్థలాలతో పాటు బీమా వర్తింపజేయాలన్నారు. అక్రిడేషన్ కమిటీలో జర్నలిస్టుల యూనియన్‌ను చేర్చాలని కోరారు. దాడులు జరగకుండా ఉండేందుకు హైపర్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఉత్తమ వార్తలు, కథనాలు రాసేవారికి అవార్డులను ప్రతి ఏటా ఇవ్వాలని కోరారు. ఉద్యోగ విరమణ చేసిన జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిరాజా, గౌస్‌షరీఫ్, వెంకటేష్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో ఆర్డీవో కార్యాలయం వద్ద ప్లకార్డులు పట్టి నిరసన తెలిపారు. అక్రిడేషన్ల మంజూరులో రాష్ట్ర ప్రభుత్వం కోత పెట్టడం సహేతుకం కాదన్నారు. ఉపాధికి, ఆరోగ్యానికి, జీవితాలకు భద్రత కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. పాత్రికేయ వత్తిలో విశేష కషి చేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం తరపున ప్రోత్సాహక అవార్డులు అందివ్వాలని కోరారు. అనంతరం ఆర్డీవో రామారావుకు వినతి పత్రం అందజేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కామేష్, పాత్రికేయులు ఎంవీ రమణ, రహంతుల్లా, వలిపి శ్రీరాములు, దిలీప్, మెహర్, నత్తం హరి, బత్తెయ్య, బాలచంద్ర, కే. వెంకటేష్, యాసిన్, దనశేఖర్, బాలూ, హకీమ్, జయశ్యామ్, కిషోర్, చాన్ బేగం, లోకనాథం, ఆనంద్, బి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. బిఎన్ కండ్రిగలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వేణు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

తిరుపతిలో...

శ్రీకాళహస్తిలో...

## కార్మిక బీమా సంస్థచే పెన్షన్ పత్రాలు పంపిణీ

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ**

అనారోగ్యంతో మతి చెందిన ఔట్సోర్సింగ్ కార్మికుడి కుటుంబానికి ఇచ్చే పెన్షన్ పత్రాలను సంబంధిత ఈఎస్ఐ అధికారులు సోమవారం అందజేశారు. కనపర్తి స్వతంత్ర కుమార్ త్రాడ్ ఐ మేనేజ్మెంట్ సంస్థలో అవుట్ సోర్సింగ్ లో ఎపి బేవరీజస్‌లో పనిచేసే వాడు. 2022 నవంబరు నెలలో గుండెపోటు తో మరణించారు. కేంద్ర ప్రభుత్వం ఇఎస్ఐ పథకం ద్వారా మరణించిన స్వతంత్ర కుమార్ తల్లిదండ్రులకు పెన్షన్ సౌకర్యం కల్పించింది. సంబంధిత పత్రాలను మతుడు తల్లిదండ్రులకు ఈఎస్ఐ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్, త్రాడ్ ఐ మేనేజ్మెంట్ యండి తదితరులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మతుడు తల్లిదండ్రులు అధికారులకు కతజ్ఞతలు తెలిపారు.

## తిరువన్నామలైకు ప్రత్యేక బస్సులు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

పౌర్ణమి పురస్కరించుకొని శ్రీకాళహస్తి ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ నుండి తిరువన్నామలైకు ప్రత్యేకమైన బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రాజవర్ధన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జూన్ 3వ తేదీన ఈ బస్సులు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు, ప్రతి గంటకు ఒక బస్సు నడుస్తుందన్నారు. ఎక్స్ ప్రెస్ కు రూ.350, అల్ట్రా డీలక్స్ రూ.425 చార్జీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ బస్సులకు శ్రీకాళహస్తి బస్టాండ్ లోని ఓపీఆర్ఎస్ లో రిజర్వేషన్ సౌకర్యము కూడా ఉందన్నారు. భక్తులు, ప్రయాణికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. వివరాలకు సెల్: 7382880178, 7382880239, 7382881715 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## అనుమతి లేని ఫ్లెక్సీలు తొలగించండి : కమిషనర్

**తిరుపతి టౌన్ :** నగరంలో అనుమతులు లేని ఫ్లెక్సీలను తొలగించాలని కార్పొరేషన్ కమిషనర్ హరిత ఆదేశించారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమం తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగింది. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ పాల్గొన్నారు. ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకోడానికి ఒక్కరోజుకు అనుమతి ఇచ్చి, మరుసటి రోజు తొలగించేలా సిబ్బందికి ఆదేశాలు ఇవ్వాలన్నారు. రైతుబజారు ముందు ఏర్పాటుచేసిన గ్రిల్స్ వల్ల వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందన్నారు. డయల్ యువర్ కమిషనర్‌కు 11 ఫిర్యాదులు అందాయి. స్పందనకు 27 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, సెక్రటరీ రాధిక, రెవెన్యూ అధికారులు కె.ఎల్.వర్మ, సేతుమాధవ్, హెల్త్ ఆఫిసర్ డాక్టర్ హరికష్ణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రమణ్యం, షణ్ముగం,మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

## డిపిఆర్‌ను పరిగణనలోకి తీసుకోవాలి : ఎంపి

**తిరుపతి టౌన్ :** సాగరమాల కింద రూ.128.80 కోట్ల అంచనా వ్యయంతో తిరుపతి జిల్లా వాకాడు మండలం రాయదరువు గ్రామం వద్ద పులికాట్ సరస్సులోకి సముద్ర ముఖద్వారం తెరవడం గురించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదించిన వివరణాత్మక ప్రాజెక్టును పరిగణనలోకి తీసుకోవాలని ఎంపి గురుమూర్తి ఢిల్లీలో ఓడరేవులు షిప్పింగ్ జలమార్గాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీతో సోమవారం భేటీ అయ్యారు. పులికాట్ సరస్సు పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణకు సరస్సు చుట్టూ నివసించే పేద మత్స్యకారుల కుటుంబాలకు జీవనోపాధిని మెరుగుపరచి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు వీలైనంత త్వరగా పరిపాలనా అనుమతి జారీ చేయాలని కోరారు. మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ భూషణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రాజెక్టు పనులు మూడు శాఖల పర్యవేక్షణలో జరగనున్నాయని, అన్ని అనుమతులు లభించిన వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

# 'లెర్న్' టుడే... 'లీడ్' టుమారో..!

## చదువుల్లో సంచలనం 'హోలీ గ్రీన్'

**ప్రజాశక్తి-తిరుపతి సిటీ**

'లెర్న్ టుడే... లీడ్ టుమారో' నినాదంతో హోలీగ్రీన్ విద్యాసంస్థ దూసుకుపోతోంది.. చదువుల్లో తమ అనుభవాలను రంగరించి, విద్యార్థులకు బోధిస్తూ అత్యుత్తమ ఫలితాలతో హోలీ గ్రీన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సంచలనం సృష్టిస్తోందని ఆ స్కూల్ ఛైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక తిరుచానూరు రోడ్డులోని శ్రీనివాసపురం వద్దనున్న ఆ స్కూల్ ప్రాంగణంలో ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ సేవా దృక్పథం కల్గిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం, నాణ్యతతో కూడిన బోధన విధానం అనుసరిస్తున్నామన్నారు. పాఠ్యాంశాలకు సంబంధించిన సమగ్రమైన స్టడీ మెటీరియల్, దానికి అనుబంధంగా వర్క్‌షీట్స్ అందిస్తున్నామని తెలిపారు. విద్యపరంగా వెనుకంజులో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, విద్యతో పాటు లలితకళలలో అభిరుచిని పెంపొందించడానికి మ్యూజిక్, డ్యాన్స్ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థికి అదనపు సమాచారం అందించడం కోసం చక్కటి లైబ్రరీ సదుపాయం ఉంది. మానసిక వికాసానికి, ప్రశాంతతకు యోగా తరగతులు నిర్వహించడం, విద్యార్థుల పురోగతిని తల్లిదండ్రులకు తెలియజేయడానికి తరుచుగా తల్లిదండ్రులు, టీచర్లతో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థి యొక్క విద్యా సమాచారం తెలియజేసేందుకు తల్లిదండ్రులకు మొబైల్ యాప్ సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. అనుభవంజ్ఞులైన ఉపాధ్యాయ బృందంతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో, విశాలమైన ప్రాంతంలో హోలీ గ్రీన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నెలకొల్పామన్నారు. 2023 పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని, పి.మనస్వీని 593/600, డి.జహ్నవి 589, ఎం.పుణ్య కీర్తనా 586, ఎస్.కల్యాన చక్రవర్తి 580 మార్కులతో స్కూల్ టాపర్లగా నిలిచారన్నారు. ప్రస్తుతం ఒకటి నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8333830044, 83338 30055 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

**ప్రత్యేకతలు**

- స్మార్ట్‌బోర్డు ద్వారా విద్యాబోధన.
- మ్యాథ్స్, సైన్స్, కంప్యూటర్‌కు సంబంధించిన ల్యాబ్ సౌకర్యం.
- ప్రతి తరగతికీ కేవలం 30 మంది విద్యార్థులు మాత్రమే.
- కోలీగ్రాఫీ, ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ.
- ఆన్‌లైన్ ఎగ్జామ్స్ నిర్వహించడం.
- విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ఐఐటి, జెఈఈ, నీట్, సివిల్స్‌కు ప్రత్యేక శిక్షణ.
- అటెండెన్స్, హోమ్‌వర్క్, మంత్‌లాగ్, ఎగ్జామ్ షెడ్యూల్, ప్రోగ్రస్, ఇతరత్రా.
- అన్ని తరగతులు డిజిటలైజడ్.
- ఎడ్యుకేషన్, డిసిప్లేన్, వాల్యూస్, స్పోర్ట్, ఫైనార్ట్స్.

## కేరళ 'ఆర్య' ఆయుర్వేద వైద్యశాలలో టిటిడి బృందం

**ప్రజాశక్తి - తిరుపతి సిటి**

దేశంలో ప్రసిద్ధి చెందిన కేరళ రాష్ట్రం కొట్టక్కల్‌లోని ఆర్య ఆయుర్వేద వైద్య పరిశోధన కేంద్రం, ఆస్పత్రి, ఫార్మసీని టిటిడి జేఈవో సదా భార్గవి, సిఎఒ శేషశైలేంద్ర, ఆయుర్వేద ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేణు దీక్షిత్ సోమవారం సందర్శించారు. ప్రపంచవ్యాప్తంగా జనం ఇక్కడికి ఆయుర్వేద వైద్య చికిత్స, పంచకర్మ కోసం రావడానికి గల ప్రత్యేకతలను అధ్యయనం చేశారు. ఆసుపత్రికి రోగులు ఆన్లైన్ ద్వారా, నేరుగా వచ్చి ఓపీ, ఇన్ పేషెంట్ సేవలు పొందుతున్న విధానం గురించి అక్కడి అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఉచిత, ఫీజు వసూలు చేసే కేటగిరీల వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు. రోగులు ఏ ప్రాంతం నుండి ఇక్కడికి ఎలా చేరుకుంటున్నారనే సమాచారం తీసుకున్నారు. ఫ్రీ రూములు, పెయిడ్ రూములను, వాటి నిర్వహణ పరిశీలించారు. ఏ తరహా మందులు తయారు చేస్తున్నారు. ఏ మందులకు ఎక్కువ డిమాండ్ ఉంది అనే వివరాలు తెలుసుకున్నారు. ఇక్కడి ఫార్మసీ నుండి ఏటా రూ 500 కోట్ల టర్నోవర్ ఎలా చేయగలుగుతున్నారో చర్చించారు. విదేశాలకు మందులు పంపే మార్కెటింగ్ వ్యవస్థను పరిశీలించారు. టీటీడీ ఆసుపత్రికి ఇక్కడి నుండి ఒక బృందాన్ని పంపాలని కోరారు. ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వారియర్ సానుకూలంగా స్పందించారు.

## స్విమ్స్‌లో ఎన్‌ఎబిఎల్ ఐఎస్‌వో ట్రైనింగ్

**ప్రజాశక్తి-తిరుపతి సిటి**

స్విమ్స్ ఆసుపత్రిలో అంతర్జాతీయ లీడ్ ఆడిటర్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్, లాబోరేటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అవసరాలు అనే అంశంపై నాలుగు రోజులు పాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. శ్రీపద్మావతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి స్విమ్స్ డైరెక్టరు డాక్టరు బి.వెంగమ్మ, ఎఫ్క్యూఐ డాక్టరు టి.వెంకటేష్, డాక్టరు కృష్ణమూర్తి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పిన విధంగా సంస్థ విజయవంతంగా ఎదిగేందుకు అందరూ పని చేసేటప్పుడు కమిట్‌మెంట్‌తో వ్యవహరించాలని తెలిపారు. రోగికి సేవ దైవ్యకార్యంగా భావించాలన్నారు. ఎన్ఎబిఎల్ కోఆర్డినేటర్ డాక్టరు ఎంఎం సుచిత్ర మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు జరిగే శిక్షణలో పాథాలజీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, వైరాలజి, ఎండోక్రైనాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ విభాగాలు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టరు సివి ఆనంద్, డాక్టరు ఉషా ఆనంద్, పాథాలజీ విభాగాధిపతి డాక్టరు ఎన్.రుక్మంగధ, రిజిస్ట్రారు డాక్టరు అపర్ణబిట్ల పాల్గొన్నారు.

## ప్రజాశక్తి జిల్లా ఇన్‌ఛార్జి శ్రీనివాసులుకు పితృవియోగం

**- మునిరత్నం మృతికి పలువురి సంతాపం**
**- నేడు మల్లయ్యపల్లిలో అంత్యక్రియలు**

**ప్రజాశక్తి-తిరుపతి సిటీ:** ప్రజాశక్తి తిరుపతి ఎడిషన్ మాజీ మేనేజర్ శ్రీనివాసులు తండ్రి పాటూరు మునిరత్నం సోమ వారం తుది శ్వాస విడిచారు. గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన డయాలసిస్ చేసుకుంటూ చికిత్స పొందు తున్నారు. సోమవారం ఆరోగ్యం మరింత క్షీణించడంతో కుటుంబ సభ్యులు తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి తర లించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయనకు పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. పాటూరు మునిరత్నం అంత్యక్రియలు చంద్రగిరి మండలం దోర్ణకంబల పంచాయతీ మల్లయ్యపల్లి గ్రామంలో మంగళవారం జరుగు తాయని కుటుంబ సభ్యులు తెలిపారు. మునిరత్నం మృతికి ప్రజాశక్తి మేనేజర్ ప్రసాద్, డెస్క్ ఇన్‌ఛార్జి వనజ, బ్యూరో ఇన్‌ఛార్జి గోపి, సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళీ, వివిధ విభాగాల ఇన్‌ఛార్జిలు, సిబ్బంది సంతాపం తెలియజేశారు.

## ఆసుపత్రికి రోటరీ క్లబ్ సాయం

**ప్రజాశక్తి -గూడూరు:** సీనియర్ రోటేరియన్ బత్తెన హనుమంతరావు కుమారుడు బత్తెన సనత్ కుమార్ వర్ధంతి సందర్భంగా సోమవారం శ్యామల హార్డ్‌వేర్, పెయింట్స్ సహకారంతో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి కంటి పరిక్షలకు సంబంధించిన పరికరాలు, మందులు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కిరణ్‌చక్రవర్తి మాట్లాడుతూ ప్రభుత్వ కంటి వైద్యులు రోటరీ క్లబ్ నుంచి పరికరాలు ఇప్పించాలని కోరడంతో దాత బి.హనుమంతరావు ముందుకొచ్చి వారి కుమారుడి జ్ఞాపకార్థ ం రూ.2.5 లక్షల విలువైన పరికాలను విరాళంగా అందించారు. రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మయూరి శ్యామ్‌యాదవ్, సీనియర్ రోటేరియన్ పి.వి. కృష్ణయ్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టరు.షేక్ షరీనా, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణోత్సవంలో మంత్రి దంపతులు



**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత సదాశివ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం జరిగిన కల్యాణోత్సవంలో రాష్ట్ర పర్యాటక మంత్రి ఆర్.కె.రోజా సెల్వమణి దంపతులు పాల్గొన్నారు. మంత్రి రోజా సెల్వమణి దంపతులకు ఆలయ ధర్మకర్తల మండలి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ఆవరణలో నూతనంగా రూ.6 లక్షల విరాళాలతో నిర్మించిన ఫ్లోరింగ్‌ను మంత్రి ఆర్.కె.రోజా ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొడగంటి రమేష్, కమిటీ సభ్యులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## హామీల అమల్లో జగన్ వైఫల్యం

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** బీసీల ద్రోహి ప్రధాని మోదీ అని, హామీల అమల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ వైఫల్యం చెందారంటూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు మండిపడ్డారు. స్థానిక శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీపీ మండల్ నివేదికను కేంద్రం బుట్టదాఖలు చేసిందన్నారు. మోదీ ప్రభుత్వం గద్దెనెక్కి పదేళ్లు పూర్తి చేసుకోబోతున్నా బీసీ గణన చేపట్టలేదన్నారు. బీసీ కోటాలో రాజ్యాంగ పదవులు అనుభవిస్తున్న ప్రధాని ఆ వర్గాలకు ఒరగబెట్టింది సున్నా అంటూ మండిపడ్డారు. 18 రాజకీయ పార్టీల మద్దతుతో, 22 బీసీ సంఘాల నాయకులు దేశ వ్యాప్తంగా నిరసనలు తెలుపుతూ వస్తున్నామన్నారు. సీఎం జగన్ ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేపట్టినప్పుడు రజకులు, కుమ్మరి, నాయి బ్రాహ్మణులకు మంత్రులు, ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అయినా హామీలు ఎందుకు అమలుపర్చలేదని ప్రశ్నించారు. బీసీలు వారి హక్కులను సాధించుకోవాలన్నా, చట్ట సభల్లో, మంత్రిత్వ శాఖలో ప్రాతినిధ్యం వహించాలన్నా బీసీలంతా ఐక్యతారాగం పాడాలన్నారు. బీసీలను రాజ్యాధికారం వైపు నడిపించడమే లక్ష్యంగా ఆగస్టు 7వ తేదీన తిరునగరి వేదికగా తలపెట్టబోతున్న ఓబీసీ దేశ వ్యాప్త మహా సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వర రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర యువజన అధ్యక్షుడు క్రాంతి కుమార్, పట్టణ అధ్యక్షుడు గురు సాయి, సోమశేఖర్, శ్రీనివాసరావు, భాస్కర్ తదితరులు పల్గొన్నారు.

## సాగు భూములకు హక్కు కల్పించండి

**ప్రజాశక్తి-వెంకటగిరి:** వెంకటగిరి మండలం పాలెంకోట, కలపాడు గ్రామాలలో సాగు చేసుకుంటున్న భూములకు సాగు హక్కు కల్పించాలని కోరుతూ సోమవారం స్పందనలో రైతులు తహశీల్దారు పద్మావతికి వినతిపత్రం అందించారు. ఎప్పుడో ఇచ్చిన సీజేఎఫ్ఎస్ భూముల సాగులో లేని వారికి సాగు హక్కు కల్పించలేమని, సాగు చేసుకుంటున్న రైతుల పేర్లు ఆన్లైన్లో పొందుపరచడం సాగు హక్కు కల్పించడం జరగదని అవి తమ పరిధిలో లేనివని తెలియజేశారు. ప్రభుత్వ అనాదీన భూముల్లో పేదలు పంటలు పండించుకుంటూ ఉంటే వాటిని పరిశీలించి అర్హులైన వారి పేర్లు తమపై ఉన్నతాధికారులకు తెలియజేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మొక్కజొన్న సాగుకు సమాయత్తం..!

● 30 నుంచి జూన్ 30 వరకు అదును ● 90 నుంచి 120 రోజుల్లో పంట చేతికి ● తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

**ప్రజాశక్తి - బాలాయపల్లి**

**ఖరీఫ్ మొక్కజొన్న విత్తుకోవడానికి ప్రస్తుతం అనుకూల సమయమని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మొక్కజొన్న పొత్తులకు, ఎండిన గింజలకు మంచి ధర లభిస్తుండటంతో రైతులు ఖరీఫ్‌లో మొక్కజొన్న పంట సాగుపై మక్కువ చూపుతారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వస్తుంది. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు మెండుగానే కురుస్తాయి. దీంతో ప్రత్యేకంగా నీటిని పెట్టాల్సిన అవసరం ఉండదు.**

**వర్షాధార పంట**

మొక్కజొన్న వర్షధార పంట. వేసవిలో వర్షాలు కురుస్తుంటాయి. ముఖ్యంగా ఏప్రిల్, మే నెలల్లో ఈదురు గాలులు, ఉరుములు, పిడుగులు, వడగళ్లతో తరచూ వర్షం పడుతుంటుంది. దీంతో నేల బాగా గుల్లబారి మే నెలలో వేసవి దుక్కులు చేసుకోవడానికి అనువుగా తయారవుతుంది. చాలా మంది రైతులు వేసవి దుక్కుల ను పూర్తి చేసి ఖరీఫ్ పంటల సాగుకు పొలాలను సిద్ధం చేసుకున్నారు. మొక్కజొన్న సాగు చేసే రైతులు ఈ నెలాఖరు నుంచి జూన్ నెలాఖరు వరకు విత్తుకోవచ్చు. మొక్కజొన్న సాగుకు ఎర్ర నేలలు, లోతైన మధ్యరకపు రేగడి నేలలు, మురుగునీరు పోయే నేలలు అనుకూలం.

**విత్తన రకాలు :**

డీహెచ్ఎం-113, బయో-9681, 900 ఎంగోల్డ్‌బీ 90 నుంచి 100 రోజుల్లో పంట చేతికి వచ్చే మధ్యకాలిక రకాలు డీహెచ్ఎం-111, డీహెచ్ ఎం-119, కేహెచ్-510, కేహెచ్-9541, బయో-9637, ఎంసీ హెచ్-2, కోహినూర్, కేఎంహెచ్-25కె60 రకాలుబీ 90 రోజులకన్నా తక్కువ కాలపరిమితి ఉన్న డీహెచ్ఎంఎం-1, వీఎల్49, ఎంఎంహెచ్-133, ఎంఎంహెచ్-3342 రకాలు అనుకూలం. ఎకరానికి హైబ్రిడ్ రకాలు 7-8 కిలోలు, తీపిమొక్కజొన్న 3-4 కిలోలు, పేలాల మొక్కజొన్న 5 కిలోల విత్తనాలు అవసరం అవుతాయి. ఎకరాకు 175 కిలోల యూరియా, 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 35 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులు అవసరం అవుతాయి. ఏజెన్సీ ప్రాంతానికి 100 నుంచి 120 రోజుల్లో పంట చేతికి వచ్చే దీర్ఘకాలిక రకాలు.

**కలుపు నివారణ**

పొలంలో విత్తనాలు నాటిన రెండు రోజులలోపు కలుపు నివారణకు అట్రాజెన్ అనే మందు ఎకరాకు 800-1200 గ్రాములు తీసుకుని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. మొక్కజొన్న తరువాత అదే పొలంలో రాజ్‌మా, వలిసెల పంటలను సాగుచేయాలని భావించే రైతులు మొక్కజొన్న పంటలో కలుపు నివారణకు అట్రాజెన్ మందుకు బదులు పెండిమిథాలిన్ మందును ఎకరాకు ఒక లీటరు చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. విత్తిన 30 రోజుల తర్వాత 2-4-డి సోడియం సాల్ట్ ఎకరాకు అర కిలో చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన 30-45 రోజులకు అంతర కషిచేసి కలుపు మొక్కలను నివారిం చుకోవాలి. ఒకవేళ పూతకు ముందు, పూత దశలో, గింజ పాలుపోసుకునే దశలో వర్షం పడకపోతే నీరు పెట్టాల్సి ఉంటుంది. మొక్కజొన్న పైరును కాండం తొలుచు పురుగు ఆశిస్తుంటుంది. నివారణకు మోనోక్రోటోఫాస్ మందును లీటరు నీటికి 1.6 మి.లీ.ల చొప్పున పిచికారీ చేయాలి.

### తక్కువ పెట్టుబడి...దిగుబడి అధికం

ఖరీఫ్ సీజన్‌లో నీటి కొరత వచ్చినప్పుడు మొక్కజొన్న పంటలు పండించుకోవచ్చు. ప్రస్తుతం ఈ సీజన్‌లో మొక్కజొన్నలు సాగు చేసుకోవడంతో రైతుకు ఎంతో లాభం. ఇలాంటి పంటలు సాగు చేసుకోవడం వల్ల రైతుకు లాభం అధికంగా వస్తుంది. రైతులు తమ అనుమానాలను వ్యవసాయాధికారుల సలహాలతో నివృత్తి చేసుకోవాలి. ప్రభుత్వం అందించే పథకాల గురించి ప్రతి రైతులు తెలుసుకోవాలి. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంటాయని సూచించారు.

- శిరీష, వ్యవసాయాధికారిణి, బాలాయపల్లి

# త్వరలోనే సంక్షేమ పథకాల విప్లవం



**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సంక్షేమ శకం ఎన్టీఆర్‌తో ప్రారంభమైతే ఆ తరువాత చంద్రబాబునాయుడు మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసి టీడీపీ అంటేనే బడుగు బహీనవర్గాలకు ఆశాజ్యోతిగా ఆవిష్కృతం చేశారని టీడీపీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానాడు వేదికగా ఆదివారం చంద్రబాబునాయుడు ప్రకటించిన మేనిఫెస్టో రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, పేదల సంక్షేమంపై టీడీపీకి ఉన్న బాధ్యతను తెలియజేస్తోందన్నారు. నవరత్నాల పేరుతో.. ఒక్క ఛాన్స్ పేరుతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆంధ్ర ప్రదేశ్ ప్రజలను హోల్‌సేల్‌గా మోసం చేశారని వైసీపీ దుర్మార్గ పాలనలో దగాపడ్డ తెలుగు జాతి కోసం చంద్రబాబునాయుడు మహానాడులో ప్రకటించిన తొలి విడత మేనిఫెస్టో దుర్భర జీవితాన్ని గడుపుతున్న పేదలు, మధ్య తరగతి వర్గాలకు భవిష్యత్తుపై కొత్త ఆశలు చిగురిస్తున్నాయని తెలిపారు. చంద్రబాబునాయుడు ప్రజల కష్టాలను చూసి మహిళా శక్తి పేరుతో 18 నుంచి 59 ఏళ్ల ప్రతి మహిళకు నెలకు రూ.1,500, సిలిండర్ ధర రూ.1,200 చేరడంతో ప్రతి ఇంటికి ఏడాదికి 3 సిలిండర్లు ఉచితం, చదువుకొనే ప్రతి బిడ్డకు ఏడాదికి తల్లికి వందనం పేరుతో ఎంతమంది ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15,000, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో జిల్లా వ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించే అవకాశం ప్రకటించి వారిని కష్టాల నుంచి గట్టెక్కించే తోబుట్టువు అయ్యారు. మహానాడులో ప్రకటించిన సంక్షేమ పథకాలు రాష్ట్ర దశ దిశను మార్చనున్నాయని.. పేదరికాన్ని సమూలంగా నిర్మూలించే పథకాలు ప్రకటించిన చంద్రబాబు నాయుడు రాష్ట్ర గతిని మార్చనున్నారని వివరించారు.

## విద్యాకానుకల పరిశీలన

**ప్రజాశక్తి-నాయుడుపేట:** జగనన్న విద్యాకానుకతో చదువుకునే స్కూల్ పిల్లలకు అన్నివిధాలా ప్రోత్సాహం లభిస్తుందని నాయుడుపేట తహశీల్దార్ రాజేంద్ర అన్నారు. నాయుడుపేట ఎంఈవో ఎస్.కోమలాదేవి ఆధ్వర్యంలో విద్యాకానుక కిట్లను సోమవారం ఆయన పరిశీలించారు.

## వాలంటీర్లకు ఘన సత్కారం

**ప్రజాశక్తి-కేవీబీపురం:** స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వాలంటీర్లను ఘనంగా సన్మానించారు. వాలంటీర్లు చేసిన సేవలను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గుర్తించి సన్మానించి పురస్కారాలు అందజేయాలని నిర్ణయించారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రయ్య, తహశీల్దారు చంద్రశేఖర్, ఎస్ఐ సునీల్, వైసీపీ కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలంకారీ వర్క్‌షాపు ప్రారంభం

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ (తిరుపతి), డి.సి హ్యాండీక్రాఫ్ట్స్ సౌజన్యంతో సోమవారం పట్టణంలోని బీపీ అగ్రహారంలో కలంకారీ డిజైన్ అండ్ టెక్నికల్ డెవలప్మెంట్ వర్క్‌షాపును ప్రారంభించారు. డిజైనర్లు కుమారి, మేఘా మంజునాథ్, నేషనల్ అవార్డు గ్రహీత విశ్వనాథ రెడ్డి కలంకారీలకు 25 రోజులుపాటు సరికొత్త డిజైన్లు, మెటీరియల్ ఫినిషింగ్, మార్కెటింగ్ గురించి పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తారు. కార్యక్రమం ప్రారంభోత్సవంలో హ్యాండి క్రాఫ్ట్ సొసైటీ అధికారి సత్యమూర్తి, వెంకటముని, గుణశేఖర్, వెంకటేశ్వరులు, వినోద్ పాల్గొన్నారు.

## రేపు మండల సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ :** ఈనెల 31న పుత్తూరు సాధారణ మండల సర్వసభ్య సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఇందిరమ్మ తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో అధ్యక్షులు, కోఆప్షన్ మెంబర్, మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

# వడమాలపేట అభివృద్ధికి అందరి సహకారం

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** వడమాలపేట అభివృద్ధికి సమిష్టి సహకారం అవసరమని.. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రతిఒక్కరూ సహకరించాలని వడమాలపేట ఎంపీపీ విజయలక్ష్మి కోరారు. సోమవారం వడమాలపేట మండల పరిషత్తు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారిలోని పాదిరేడు మలుపు వద్ద, మండల కార్యాలయాల వద్ద వేగ నిరోధకం ఏర్పాటు చేయాలని..సూచించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక కాబడిన పంచాయతీ సర్పంచులకు ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం వాలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పౌరులందరూ నిబంధనలు పాటించాలి

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** దేశ పౌరులందరూ నిబంధనలను పాటిస్తూ పన్నులను సకాలంలో చెల్లించాలని.. బాధ్యతాయుతమైన వ్యవస్థలను నిర్మించడం సాధ్యమవు తుందని బెంగళూరు ఇన్కమ్ టాక్స్ ఉప కమిషనరు ఐఆర్ఎస్ అధికారిణి పూజిత అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటట్స్ ఆఫ్ ఇండియా, తిరుపతి చాప్టర్ వారిచే సోమవారం తిరుపతి పట్టణంలో జరిగిన " పన్ను ఎగవేత- దాని పరిణామాలు " అన్న అంశంపై సదస్సును నిర్వ హించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన పూజిత పన్నును ఎగవేయడంతో దేశ ఆర్థిక పురోగతి, వ్యవస్థల పనితీరులపై పలు స్వీయ అభిప్రాయాలను సదస్సుకు వివరించారు. ఇలాంటి సదస్సులు నిర్వహిం చడంతో పన్నుల వ్యవస్థపై ఆయా రంగాలకు సంబంధించిన నిపుణులకే కాకుండా సామాన్య పౌరులకు మంచి అవగాహన కలుగుతుందన్నారు. సదస్సు నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన తిరుపతి ఐసిఎఐ వైస్ ఛైర్మన్ ఆళ్ల పార్థసారథి, తిరుపతి చాప్టర్ ఛైర్మన్ రమేష్‌ను ప్రత్యేకంగా అబి నందించారు. ఈ కార్యక్రమానికి పలువురు ఛార్టెడ్ అకౌంటట్లు, కాస్ట్ అకౌంటట్స్, విద్యార్థులు హాజరయ్యారు.

## మొదటి ఘాట్‌లో టెంపో బోల్తా

### ఇద్దరికి తీవ్రగాయాలు

**ప్రజాశక్తి - తిరుమల :** తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో మరోసారి ప్రమాదం జరిగింది. ఘాట్ రోడ్డులోని ఆరవ మలుపు వద్ద టెంపో ట్రావెలర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురు భక్తులు గాయపడ్డారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో బాధితులను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. బాధిత భక్తులు కర్ణాటకలోని కోలార్‌కు చెందిన వారుగా అధికారులు గుర్తించారు. టెంపో ట్రావెలర్ డ్రైవర్ అజాగ్రత్తగా వ్యవహారించడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. అయితే ఇటీవలే మొదటి ఘాట్ రోడ్డులో చోటు చేసుకున్న బస్సు బోల్తా ప్రమాదం మరువకముందే మరో ప్రమాదం జరగడం గమనార్హం.

## అర్జీలకు సకాలంలో పరిష్కారం

**తిరుపతి టౌన్ :** 'స్పందన' కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత కాల వ్యవధి లోపల ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలకు అర్థవంతంగా పరిష్కారం చూపాలని కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరావుతో కలిసి గ్రీవెన్స్ అర్జీలను స్వీకరించారు. వీరితో పాటు ఎస్‌డిసిలు కోదండ రామిరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు. మొత్తం కలిపి 116 వినతులు అందాయి.

## అట్టహాసంగా జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీలు

**తిరుపతి టౌన్ :** విశ్వం హైస్కూల్లో రెండో జాతీయ స్థాయి రోలర్ స్కి స్కేటింగ్ పోటీలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 13 రాష్ట్రాల నుంచి దాదాపు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా స్కి అండ్ స్నోబోర్డ్ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అర్షద్, కోశాధికారి రేణుక, ఉపాధ్యక్షులు రజాక్, విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోలర్ స్కై అసోసియేషన్ ఛైర్మన్ ఎన్.విశ్వ చందన్ రెడ్డి,కార్యదర్శి రసూల్‌ఖాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేంద్ర రెడ్డి, ఇంటర్నేషనల్ అథ్లెట్ ఆంజనేయులు నాయుడు జ్యోతి ప్రజ్వలనం చేసి క్రీడా జ్యోతిని వెలిగించారు. క్రీడా కారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు.

# రానున్న ఎన్నికల్లో వైసీపీదే విజయం

**ప్రజాశక్తి-తిరుపతి సిటీ:** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతత్వంలో రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో తిరుపతిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు ఓట్లు వేసి మరోసారి అధికారాన్ని అందిస్తారన్నారు. ప్రతిపక్ష చంద్రబాబు పార్టీని ఆరు అడుగుల లోతులో పూడ్చి సమాధి చేస్తారని తెలిపారు. 14 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి పేద ప్రజల అభ్యున్నతి కోసం ఒక్క కార్యక్రమం చేయలేదని విమర్శించారు. కోట్ల రుణాలను రద్దు చేస్తామని చేస్తామని హామీలు గుప్పించాడన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా మళ్లీ అధికారం కోసం రాజమహేంద్రవరం మీటింగ్‌లో హామీల చిట్టాను భుజానకెత్తుకున్నాడని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేద అక్కచెల్లెమ్మలకు అందజేసిన ఇంటి స్థలాలను శ్మశాన వాటికతో పోలుస్తూ చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు చేయడం విచారకరమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. పేదలు ఆ ఇళ్లను దేవాలయాలుగా భావిస్తున్నారని, ఒక బాధ్యత కల్గిన ప్రతి పక్ష నేతగా చంద్రబాబు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సహేతుకం కాదని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. చంద్రబాబు వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం పట్టణంలోని నాలుగు మాడా వీధుల్లో వైసీపీ నాయకులు స్కూటర్ ర్యాలీ చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. వెంటనే బాబు తన వ్యాఖ్యలను ఉప సంహరించుకుని బేషరతుగా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంజూరు శ్రీనివాసులు, వయ్యాల కృష్ణారెడ్డి, మున్నా, జయశ్యామ్, ఉన్నం వాసు నాయుడు, కోవి చంద్రయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**గూడూరు టౌన్ :** రాష్ట్రంలో ప్రతి పేదవాడి సొంత ఇంటి కలను నిజం చేస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 30 లక్షలకు పైగా నివేశ పట్టాలు ఇవ్వడం జరిగిందని.. పేదవాడి ఇంటి స్థలాలను శ్మశానాలతో పోలుస్తూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ వెల్లడించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యాఖ్యలు ఖండిస్తూ గూడూరు రెండవ పట్టణ పరిధిలోని కోర్టు సెంటర్ నుండి ఎమ్మెల్యే వరప్రసాద్ రావు , వైసిపి నాయకులు కార్యకర్తలు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, మీరా రెడ్డి , వైసీపీ సీనియర్ నాయకులు బత్తిని విజయకుమార్, జడ్పీటీసీ యామిని, మురళీ, శ్రీనివాసులు, వినిష్, అజీజ్, సుభాన్ పాల్గొన్నారు.